GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా
T MEDIA
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్

సంపుటి : 7 | సంచిక : 287 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 16.04.2025 | పేజీలు : 3



## మే 2న అమరావతికి ప్రధాని మోదీ

**టీ మీడియా,ఏప్రిల్ 15, అమరావతి :**
రాజధాని పునః నిర్మాణ పనులకు శ్రీకారం ప్రధాని నరేంద్ర మోదీ మే 2న అమరావతిలో పర్యటించనున్నారని మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోదీ పర్యటన మే 2వ తేదీన ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 ఏళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రహదారులు పూర్తి చేయాలన్న సీఎం వెల్లడించారు.ఇన్?ఛార్జ్ మంత్రుల పర్యటనల్లో 3 పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలని తేల్చి చెప్పారు. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.



# గీత దాటితే ఊరుకునేది లేదు

## సీఎల్పీలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

### పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచన

**టి మీడియా, ఏప్రిల్ 15, హైదరాబాద్ బ్యూరో :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో సీరియస్ అయ్యారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హెూటల్‌లో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో సీఎం పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల ముందు మాట్లాడారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని తెలిపారు.

**ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు**

మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అంటూ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. జనంలోకి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలన్నారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

**సన్నబియ్యం పథకం ఒక అద్భుతం**

ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సీఎం పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమని సీఎం వివరించారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందని క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకే అందాలని దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.వారికి శాశ్వత పరిష్కారం చూపాం : కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామన్న సీఎం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని ఇది ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడించారు. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు.

**విష ప్రచారం చేస్తున్నారు**

హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని, ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుందని మనం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదన్నారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు.

**తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోంది**

మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారని ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారన్నారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి,బిక్కిరి అవుతున్నారని తెలిపారు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందన్నారు రాయబోతోం దన్నారు. దేశంలో తెలంగాణ మోడల్?పై చర్చ జరుగుతోందని తెలిపారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్?ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయన్నారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సన్న బియ్యం మన పథకం మన పేటెంట్, మన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

## కుల, మత ప్రాంతాలను రెచ్చగొడుతున్నారు

### సీఎం చంద్రబాబు ఆగ్రహం

**మంత్రివర్గ సమావేశంలో చర్చ**



**టీ మీడియా,ఏప్రిల్ 15, అమరావతి :**
సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 3 గంటల పాటు సాగిన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ ఆర్డినెన్స్ ద్వారా జిల్లాలవారీగా జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు. వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఇచ్చే సాయం 20 వేలకు పెంచింది ప్రభుత్వం. ఏప్రిల్ 26న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు అనంతరం సీఎం చంద్రబాబు మంత్రులతో తాజా రాజకీయ పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించారు. కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చగొడుతున్నాడని సీఎం మండిపడ్డారు. తిరుపతి గోశాల అంశం, పాస్టర్ ప్రవీణ్ మరణం, వక్ఫ్ బోర్డు బిల్లు అంశాలతో 3 మతాలను రెచ్చగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వైఖరి ఎలా ఉందో కళ్లముందు కనిపిస్తోందన్న సీఎం ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొడుతూనే ప్రజల్ని చైతన్య పరచాలని మంత్రులకు చెప్పారు.అధికారుల అవినీతిపై తరచూ చర్చ జరుగుతుండటం సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ప్రస్తావించారు. రాజకీయంగా అంతా బాగానే ఉన్నా అధికారుల స్థాయిలో ఈ తరహా చర్చలు సరికాదని స్పష్టం చేశారు. ఏ శాఖ పరిధిలోని మంత్రులు ఆ శాఖ అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యూరోక్రసీలో అవినీతిపై ఈ మధ్య ఎక్కువగా చర్చకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార భరోసా అమలుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.ఎలాంటి గందరగోళం ఉండకూడదు: మనం తీసుకునే రాజకీయ నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం ఉండకూడదని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు ఏది మంచో అదే నిర్ణయాన్ని మనం తీసుకుంటున్నామని వెల్లడించారు. వైఎస్సార్సీపీ వక్ఫ్ బోర్డ్ బిల్లు అంశంలో 3 రకాలుగా వ్యవహరించిందని తెలిపారు. పార్లమెంట్?లో ఒకలా, రాజ్యసభలో మరోలా, కోర్టులో మరోలా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ నేతల రాజకీయ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండకడుతూనే, మనం తీసుకున్న నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం లేకుండా చూసుకోవాలని మంత్రులకు స్పష్టం చేశారు.

**ఏపీని తొలిస్థానంలో నిలపడమే లక్ష్యం**

అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలపడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ప్రయాణం మొదలుపెట్టిన రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బెంగళూరు తొలిస్థానంలో ఉండగా హైదరబాద్‌ను రెండో స్థానానికి తీసుకొచ్చామని అన్నారు. అప్పట్లో తాము తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే నేడు హైదరాబాద్ అన్ని రంగాల్లో ముందుందని అన్నారు. వృద్ధి రేటులో ఇప్పుడు ఏపీ రెండోస్థానంలో ఉందని దీన్ని తొలిస్థానానికి తీసుకెళ్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చెక్కుల పంపిణీ




**టీ మీడియా,ఏప్రిల్ 15,హైదరాబాద్:**
ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ రాష్ట్రంలో పేదల కల అయిన సొంతింటి ఆశయాన్ని సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. పథకం తొలి దశలో అత్యంత పేదలైన, నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఇంది రమ్మ ఇళ్ల చెక్కుల పంపిణీ షురు చేశారు. మంగళవారం శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల చెక్కులను పంపిణీ చేశారు.తెలంగాణ వ్యాప్తంగా జిల్లాలకు సంబంధించిన 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల చెక్కులను పంపిణీ చేశారు. అందులో రంగారెడ్డి, సూర్యాపేట, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్ నగర్, సిద్దిపేట జిల్లాల వాసులు ఉన్నారు. ఇందిరమ్మ ఇల్లులో మొట్టమొదటి బిల్లును దేవరకద్రకు చెందిన తెలుగు లక్ష్మి, మరికొందరు లక్ష రూపాయల చెక్కును అందుకున్నారు. కాగా, శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

## చంచల్‌గూడ జైల్లో ఇన్‌స్టా రీల్స్

- ఎంజాయ్ చేస్తున్న ఖైదీలు

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైదరాబాద్:**
పాతబస్తీకి చెందిన అహ్మద్ జబ్రీ ఏప్రిల్ 11న దారి దోపిడీ కేసులో అరెస్టు కావడంతో.. చంచల్‌గూడ జైలుకు రిమాండ్ ఖైదీగా పంపారు. మరుసటి రోజు అతడిని కలిసేందుకు కొందరు స్నేహితులు జైల్‌కు వచ్చారు. అక్కడ ములాఖత్ సమయంలో జబ్రీతో కలిసి రీల్స్ చేశారు. జబ్రీ ల్యాండ్ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు, విచిత్ర భంగిమలతో చేతులూపడం, హావాభావాలతో జైలులో ఎంజాయ్ చేస్తున్నట్లు.. వీడియో షుట్ చేశారు. ఇక ఈ వీడియోను ఏప్రిల్ 13న అహ్మద్ జబ్రీ పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్‌లో చంచల్‌గూడ జైలు అంటూ పోస్టు చేశారు. ఇక ఈ వీడియో జైలు అధికారులతోపాటు అందరికీ చేరడంతో అదికాస్తా వైరల్ అయ్యింది. దీంతో రీల్ షుట్ చేసి అప్‌లోడ్ చేసిన వ్యక్తిని గుర్తించి చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు.సాధారణంగా ఆదివారాలు తప్ప ఖైదీలను. విచారణలో ఉన్న ఖైదీలను కలవడానికి నిత్యం వందలాది మంది కుటుంబ సభ్యులు, స్నేహితులు చంచల్‌గూడ జైలుకు వస్తుంటారు. అయితే చుట్టూ ఎందరో పోలీసులు, సీసీ కెమెరా నిఘాలో ఉండే జైల్లోనే ఏకంగా ఖైదీతో రీల్స్ చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



పోలీసుల నిఘా లేకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందని నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేరాలు చేసి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు.. చంచల్‌గూడ జైలు టూర్ స్పాట్ మాదిరి ఉందని, నేరస్థులు కటకటాల వెనుక కూడా ఎంజయ్ చేస్తున్నట్లు కనిపిస్తుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. జైలులో రీల్స్ తీసిన అంశంపై చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ స్పందిస్తూ.. ములాఖత్‌కు వచ్చిన వారు దుస్తుల్లో మొబైల్ దాచుకుని వచ్చారని, రీల్స్ చేసిన సమయంలో గార్డ్ డ్యూటీలో ఎవరెవరు ఉన్నారో తనిఖీ చేస్తున్నామన్నారు. వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, జైలులో ములాఖత్‌కు వచ్చే వారి విషయంలో ఇకపై జాగ్రత్తలు పాటిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## రానున్న మూడు రోజులు వర్షాలు



**టీ మీడియా,ఏప్రిల్ 15,హైదరాబాద్ బ్యూరో:**
నెల రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలో ఎండలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా మార్చి నెలలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. భారీ ఎండల కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అల్లాడిపోయారు. బయటకు వస్తే భారీ ఉష్ణోగ్రతలు.. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే ఏప్రిల్ నెలలో మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలతో పాటు పలు చోట్ల వర్షాలు దంచికొడుతున్నాయి.గత మూడు వారాలు చూసుకుంటే.. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయంటే ఎండలు ఏ రేంజ్ లో కొడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మూములుగా మే నెలలో ఎండలు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. మార్చి మాసంలోనే ఎండలు మే నెలను తలపించాయి. ఏప్రిల్ నెలలో మాత్రం పలు చోట్ల ఎండలతో పాటు వర్షాలు కొడుతున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో గత రెండు, మూడు రోజుల నుంచి చాలా చోట్ల 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే 42 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదు అయ్యాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో దంచి కొట్టాల్సిన ఎండలు.. ఇప్పుడే చుక్కలు చూపిస్తున్నాయి. అయితే ఈ సమయంలోనే హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది.తెలంగాణ రాష్ట్రంలో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. అయితే, మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు కూడా రానున్న మూడు రోజుల పాటు మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగనున్నాయని.. రెండు నుంచి మూడు డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.అకాల వర్షాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లొద్దని చెబుతున్నారు.



## నేడు ఒడిశాలో... సింగరేణి బొగ్గు బ్లాక్ ప్రారంభం

-ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బట్టీ

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైద్రాబాద్ బ్యూరో:**
సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ ను నేడు (ఏప్రిల్ 16వ తేదీ) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు వర్చువల్ గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

**తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...**

మిగతా 3లో..

# భూభారతి చట్టం పై క్షేత్రస్థాయిలో అవగాహన

● **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**టీ మీడియా, ఏప్రిల్ 15, వనపర్తి బ్యూరో:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం పై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో కలెక్టరేట్ సూపరింటెండెంట్ లతో భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించడం పై సమీక్ష నిర్వహించారు. భూ భారతి చట్టం- 2025 పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్, 17 నుండి మండలాల వారీగా రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం పై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి చట్టం- 2025 ప్రకారం ఒకేరోజు రిజిస్ట్రేషన్ తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు సంబంధిత భూమి సర్వే చేసే మ్యాప్ తయారు చేయడం జరుగుతుంది. తహసిల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ చేస్తారని తద్వారా నెలల తరబడి మ్యుటేషన్ కొరకు తిరగటం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం ఉండదన్నారు.




అదేవిధంగా ప్రతి రిజిస్ట్రేషన్ భూమికి పట్టాదార్ పాస్ పుస్తకంలో హద్దులతో కూడిన చిత్రపటం ఉంటుందని, భూదాన్ యూనిక్ గుర్తింపు నెంబరు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ధరణిలో పెండింగ్ ఉన్న ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చట్టంలో వెసులుబాటు కల్పించారని తెలియజేశారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుంది. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూ సమస్యల పరిష్కారానికి రెండెంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం భూ భారతి చట్టంలో కల్పించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

# స్వయంప్రతిపత్తి కోసం కమిటీ

● **స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం**

**టీ మీడియా,ఏప్రిల్ 15, చెన్నై :**
గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయంప్రతిపత్తి కోసం చర్యలను సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధారిస్తుంది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాన్ని వివరంగా పరిశీలిస్తుంది. జనవరి 2026లో తన మధ్యంతర నివేదికను సమర్పిస్తుంది. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. సిఫార్సులతో కూడిన తుది నివేదికను ఈ కమిటీ రెండేళ్లలో సమర్పించనున్నట్లు స్టాలిన్ తెలిపారు.

**నీట్ పరీక్షను వ్యతిరేకిస్తుంటాం**

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ కమిటీ పరిశోధన చేసి సిఫార్సులు చేస్తుందని స్టాలిన్ పేర్కొన్నారు. అలాగే నీట్ పరీక్ష, త్రిభాషా విధానంపై కేంద్రం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు. నీట్ కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. నీట్ పరీక్షను నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు.

**త్రిభాషా విధానంపై విమర్శలు**

త్రిభాషా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం తమపై హిందీని బలవంతంగా



రుద్దడానికి ప్రయత్నిస్తోందని స్టాలిన్ ఆరోపించారు. తమిళనాడు సర్కార్ జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించినందున, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన రూ. 2500 కోట్లు నిధులను ఆపేసిందని విమర్శించారు. విద్యను ఉమ్మడి జాబితాకు మార్చడానికి అనుమతించే 42వ రాజ్యాంగ సవరణను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర జాబితాలో విద్య ఉండాలని డిమాండ్ చేశారు.

**గవర్నర్ వర్సెస్ తమిళనాడు సర్కార్**

బిల్లుల ఆమోదంపై గవర్నర్, తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో స్టాలిన్ సర్కార్‌కు ఉపశమనం లభించింది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని న్యాయస్థానం స్పష్టం చేసిన నేపథ్యంలో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ రిలీజ్ చేసింది. ఈ పరిణామాల వేళ రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీని ఏర్పాటు చేస్తూ స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



# మిషన్ మధుమేహ కార్యక్రమ విజయవంతం

**టీ మీడియా, ఏప్రిల్ 15, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలో మిషన్ మధుమేహ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడాన్ని పురస్కరించుకుని, ఈ కార్యక్రమంలో భాగంగా విశేషంగా పనిచేసిన ఆరోగ్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ప్రశంసించి, వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలకు నిఖార్సైన మధుమేహ పరీక్షలు నిర్వహించి, ముందస్తు జాగ్రత్తలు, జీవనశైలిలో మార్పులపై అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో మధుమేహ నియంత్రణలో మంచి ఫలితాలు సాధించగలిగామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ మిషన్ మధుమేహ కార్యక్రమం జిల్లాలో ఆరోగ్య రంగానికి ఒక మైలురాయి. గ్రామీణ ప్రాంత ప్రజల్లో మధుమేహం పట్ల అవగాహన పెరిగేలా, శీఘ్ర నిర్ధారణ ద్వారా చికిత్స అందేలా చేయడం దీని ముఖ్య ఉద్దేశం. అన్ని స్థాయిల్లో ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా పనిచేసినందుకే ఈ విజయాన్ని సాధించగలిగాం అని తెలిపారు. ఇంకా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రజారోగ్యానికి ఎంతో అవసరం. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యంతో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. అంతేగాక, భవిష్యత్‌లో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా తీసుకెళ్లి, ప్రతి గ్రామస్థాయిలో మధుమేహ పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అల్లే శ్రీనివాసులు , ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డా. రామచంద్ర రావు , స్టేట్ డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ శ్రీ అబ్దుల్ వసి , జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల, డాక్టర్ వంశీకృష్ణ , అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది , జిల్లా ఎన్సిడి టీం పాల్గొనడం జరిగింది.

# నేడు ఒడిశాలో... సింగరేణి బొగ్గు బ్లాక్ ప్రారంభం

**-ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బట్టీ**

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైద్రాబాద్ బ్యూరో:**
సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ ను నేడు (ఏప్రిల్ 16వ తేదీ) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు వర్చువల్ గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

**తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...**

2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ,ఇంధన శాఖ మంత్రి శ్రీభట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డిని క లిసి విజ్ఞప్తులు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి ఒడిశా రాష్ట్ర




ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

**నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు**

- ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గని లో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది.
- సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది.
- ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు.
- తెలంగాణలో ప్రస్తుతం గల సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయకమైనదే అని భావిస్తున్నారు.
- ఈ గనిలో మేలైన జీ - 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది.
- ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి , బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు .

ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలోని జరపడ రైల్వేసైడింగ్ కు రవాణా చేసి ,అక్కడి నుండి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.

అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది.



# రాజన్న సన్నిధిలో పోటెత్తిన భక్తులు

**టీ మీడియా,ఏప్రిల్ 15,వేములవాడ :** వరుసగా సెలవులు రావడంతో వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సోమవారం భక్తులతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. దీంతో స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. బ్రేక్ దర్శనం క్యూలైన్లలోనూ భక్తులు భారీగా ఉన్నారు. స్వామి వారికి ఎంతో ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకునేందుకు భక్తులు బారులుదీరారు.

**రాజన్న సేవలో హైకోర్టు జడ్జీలు**

**వేములవాడ :** వేములవాడ రాజన్నను సోమవారం తెలంగాణ, రాజస్థాన్, ఏపీ రాష్ట్రాల హైకోర్టు జడ్జీలు ఎన్.తుకరాంజీ, ఎం.లక్ష్మణ్, ఎ.హరిహర నందశర్మ దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రొటోకాల్‌ఆఫీసర్లు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనంతరం స్వామి వారికి ఇష్టమైన కోడె మొక్కు చెల్లించారు. కల్యాణ మండపంలో ఈవో కె.వినోద్‌రెడ్డి జడ్జిలకు శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందజేశారు. వారి వెంట సిరిసిల్ల జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, తహసీల్దార్విజయ ప్రకాశ్‌రావు, ప్రొటోకాల్ ఏఈవో అశోక్ కుమార్, పర్యవేక్షకుడు శ్రీకాంత్‌చార్యులు, సిబ్బంది ఉన్నారు.

# 21న తెలంగాణ ఇంటర్ ఫలితాలు

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైద్రాబాద్ బ్యూరో:**
తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ముగించబడ్డాయి, మరియు ఇప్పుడు విద్యార్థులు ఫలితాలను కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. సమయంలో, విద్యార్థుల మనసులో టెన్షన్ పెరిగిపోతున్నది, అలాగే వారు




ప్రశాంతంగా విరామం తీసుకోవాలనికోరుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం, పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం మూల్యాంకనంలో కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. పరీక్ష ఫలితాలు విడుదలయ్యాక, ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రశ్నాపత్రాలను మరోసారి వేరిఫై చేయడం జరుగుతుంది. అలాగే, అధికారులు ఎలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొత్తం వాల్యుయేషన్, మార్కుల డిజిటలైజేషన్ వారం రోజుల్లో పూర్తి చేయాలని తెలుస్తోంది. తెలంగాణ ఇంటర్ బోర్డు ఏప్రిల్ 21న ఇంటర్ ఫలితాలను విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తుంది.

ప్రతిసారి ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన తరువాత, రీ వాల్యుయేషన్‌కు అవకాశం ఉంటుంది. దీని కోసం ప్రతి సబ్జెక్టుకు 600 రూపాయలు వసూలు చేయబడతాయి. విద్యార్థులు తమ ఫలితాలను https://tgbie.cgg.gov.in లింక్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. వాట్సప్ ద్వారా కూడా ఫలితాలను పొందడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ. 20.19 కోట్లు విడుదల

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా,ఏప్రిల్ హైదరాబాద్** :బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో



పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12 మంది లబ్దిదారులకు మంగళవారం లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు.

బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

# డ్రోన్ ఎగరేసిన వ్యక్తి

**- కేసు పెట్టిన టీటీడీ**

**టీ మీడియా,ఏప్రిల్ 15,తిరుమల:**
రోజుకో ఘటన వెలుగులోకి.. తాజాగా శ్రీవారి ఆలయం పైన డ్రోన్కెమెరాకలకలంహిందువుల ఇలవేల్పు శ్రీవారి ఆలయం పై డ్రోన్ ఎగరేసిన మహారాష్ట్ర భక్తుడు.. తిరుమలలో ఓ భక్తులు డ్రోన్ ఎగరేశాడు. అతన్ని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి



చెందిన అన్షుమన్ తరెజా అనే యూట్యూబర్ తిరుమలకు వచ్చాడు. దర్శనం చేసుకున్న తర్వాత సాయంత్రం వేళలో డ్రోన్ ఎగరేశాడు. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. తిరుమలలో నిద్రపోతున్న టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అన్షుమన్ తరెజా డ్రోన్ ఎగరవేసిన ఘటన చూసిన అక్కడే ఉన్న టీటీడీ విజిలెన్స్ అధికారులు వారించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జపాన్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైద్రాబాద్ బ్యూరో:**
ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జపాన్ పర్యటనకు బయలుదేరుతోంది. ఈ నెల 16 వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు ఈ పర్యటన కొనసాగుతుంది. టోక్యో, మౌంట్ ఫ్యూజీ, ఒసాకా, హిరోషిమా తదితర నగరాల్లో పర్యటన సాగుతుంది. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక సాంకేతిక రంగాల్లో సహకారం ప్రధాన ఉద్దేశంగా సాగుతున్న ఈ పర్యటనలో పలు సంస్థలతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం చర్చలు జరుపుతుంది. అధికారుల బృందం ముఖ్యమంత్రి గారి పర్యటనలో ఉంటారు. జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, ప్రతినిధులతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమవుతుంది. 'ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో -2025' లో తెలంగాణ పెవీలియన్‌ను ప్రారంభిస్తారు...



# సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం..

**అసలు విషయం ఇదే..**

**టీ మీడియా,ఏప్రిల్ 15,హైద్రాబాద్ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్?లో రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కంటే లిఫ్ట్ లోపలికి దిగిపోయింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. ఏం జరుగుతుందో అర్థంకాక కాసేపు




అయోమయానికి గురయ్యారు. అనంతరం పెద్ద ప్రమాదం ఏమీ లేదని తెలుసుకుని లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం మరో లిఫ్ట్‌లో ముఖ్యమంత్రిని అధికారులు తరలించారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా నోవాటెల్ హోటల్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, కొంతమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికి హోటల్ లోపలికి తీసుకెళ్లారు. అయితే పైఅంతస్తుకు వెళ్లే క్రమంలో 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డితోపాటు 13 మంది ఎక్కారు. దీంతో లిఫ్ట్ ఉండాల్సిన స్థానం కంటే కిందికి కుంగిపోయింది. వెంటనే అలారం మోగడంతో అధికారులు, హోటల్ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన లిఫ్ట్ వద్దకు పరుగులు పెట్టారు. అనంతరం సీఎం సహా అందరినీ లిఫ్ట్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం మరో లిఫ్ట్‌లో సమావేశం జరుగుతున్న సెకండ్ ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు, హోటల్ సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook